సమాచారం

ఉపాధ్యాయులకు 5రోజులు వర్క్‌షాప్

రాయదుర్గం: మనూలో సెంటర్ ఫర్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఉర్దూ మీడియం టీచర్స్(సీపీడీయూఎంటీ) ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు 5రోజుల పాటు వర్క్‌షాప్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు సీపీడీయూఎంటీ డైరెక్టర్ ప్రొఫెసర్ మహ్మద్ అబ్దుల్ నమీ సిద్ధిఖీ పేర్కొన్నారు. ఫిబ్రవరి 6 నుంచి 10 వ తేదీ వరకు ఉర్దూ మీడియం ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ వర్క్‌షాప్‌ను 'డెవలపింగ్ థింకింగ్ స్కిల్స్' అనే అంశంపై నిర్వహిస్తామన్నారు.మరిన్ని వివరాలకు సెంటర్ ఫ్యాకల్టీలు మిస్బాఅంజార్ (9948412484), డాక్టర్ మోహద్ అక్బర్(8373984391) సంప్రదించవచ్చన్నారు.

నేడు హెచ్‌సీయూలో మెగా బైక్ ర్యాలీ

రాయదుర్గం: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో మెగా బైక్ ర్యాలీని నిర్వహించనున్నట్లు ఏబీవీపీ హెచ్‌సీయూ అధ్యక్షురాలు నమ్రతా సింగ్ తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు ర్యాలీ ప్రారంభ మవుతుందని, క్యాంపస్‌లోని అన్ని ప్రధాన కేంద్రాల మీదుగా ర్యాలీ సాగుతుందన్నారు.

నేటి 'సంత'

గచ్చిబౌలి: వారాంతపు సంతల నిర్వహణలో భాగంగా గురువారం శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో ఎన్టీఆర్ కాలనీ, హుడాకాలనీ,ఆల్విన్‌కాలనీ, ఓల్డ్ హఫీజ్‌పేట్, జనప్రియ అపార్ట్‌మెంట్స్ లోని సాయిబాబా దేవాలయం, టెలికామ్‌నగర్ ఉర్దూ యూనివర్శిటీ రోడ్డులో, దూబేనగర్, టీఎన్‌జీఓ కాలనీలో నిర్వహిస్తారు. ఉదయం 10 నుంచి రాత్రి 7 గంటల వరకు నిర్వహించే ఈ సంతలో ఆకుకూరలు, కూరగాయలు, దుస్తులు, నిత్యావసరాలు, పండ్లు, ఇతర వస్తువులు లభిస్తాయి.

క్లుప్తంగా...

కంటి వెలుగు శిబిరం పరిశీలన



మియాపూర్: చందానగర్‌లోని పీజేఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సృజనలు బుధవారం పరిశీలించారు. శిబిరాల్లో ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. అవసరమైన వారికి కళ్ల అద్దాలు అందజేశారు.

అన్ని మతాల సారాంశం ఒక్కటే..

పటాన్‌చెరు: ప్రపంచంలో అన్ని మతాల సారాంశం ఒక్కటేనని, ప్రతి ఒక్కరూ పరమత సహనం పాటించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామ పరిధిలోని పీఎస్‌ఆర్ టౌన్‌షిప్‌లో ఐపీసీ.షాలెం నూతన చర్చిని బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో క్రైస్తవుల సంక్షేమానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నారన్నారు. విజయ్ కుమార్, మెట్టు కుమార్ యాదవ్, ప్రమోద్ గౌడ్ పాల్గొన్నారు.

కంటి వెలుగు కేంద్రాలు..

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని కంటి వెలుగు కేంద్రాలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

- ప్రతి సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో 8 మంది వైద్య సిబ్బంది ఉంటారు. ఒక ఆప్టోమెట్రిస్ట్, సూపర్‌వైజర్, ఇద్దరు ఏఎన్ఎంలు, ముగ్గురు ఆశా వర్కర్లు, ఒక డీఈఓ టీమ్‌లో సభ్యులుగా ఉంటారు.
- కంటి పరీక్షలు చేయించుకోవాలనుకున్న వారు ఆధార్‌కార్డు తీసుకుని రావాలి
- 100 రోజుల పాటు అన్ని పనిదినాల్లో మాత్రమే ఇవి అందుబాటులో ఉంటాయి
- శని, ఆదివారాల్లో ఈ కేంద్రాలు మూసి ఉంచుతారు.

డివిజన్‌పేరు	కంటి వెలుగు కేంద్రాలు
కొండాపూర్	అంజయ్యగర్ నగర కమ్యూనిటీహాల్
గచ్చిబౌలి	రాయదుర్గం వార్డు కార్యాలయం
శేరిలింగంపల్లి	పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
మాదాపూర్	అయ్యప్పసొసైటీ కల్చరల్ క్లబ్
హఫీజ్‌పేట్	జనప్రియ కమ్యూనిటీహాల్
చందానగర్	పీజేఆర్ స్టేడియం
భారతీనగర్	ఎంఐజీలోని సిర్కి కార్యాలయం
మియాపూర్	మయూరీనగర్ కమ్యూనిటీ హాల్

టార్గెట్ @100

ఫలితాల సాధనకు ప్రత్యేక ప్రణాళిక

- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న స్టడీ అవర్స్
- తరచు స్లిప్ టెస్ట్‌ల నిర్వహణ
- ఒక్కరోజు రాకపోయినా ఇంటికి ఫోన్
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



మధురానగర్‌లోని రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు

రాయదుర్గం: ఇంటర్‌లో ఈసారి వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపక యంత్రాంగం ప్రణాళికతో ముందుకుసాగుతోంది. మధురానగర్‌లోని రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జనవరి మొదటి వారంలోనే తగిన ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులు గాడిలో పడి మంచి ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. 2022-23 విద్యా సంవత్సరంలో ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరాల్లో వంద శాతం ఉత్తీర్ణత శాతం సాధించాలనే తపన అందరిలోనూ కనబడుతోంది.

మొత్తం విద్యార్థులు 963 మంది..

- రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొత్తం విద్యార్థులు 963 మంది చదువుతున్నారు. మొదటి సంవత్సరంలో 463 మంది, ద్వితీయ సంవత్సరంలో 500 మంది విద్యార్థులు ఉన్నారు.
- గత ఏడాది ఈ కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో 60 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా, ఫస్టియర్ ఈయర్‌లో 45 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు.
- ఇంటర్ పరీక్షలు మార్చి 15వ తేదీ నుంచి ప్రారంభమవుతాయి. సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ ఫిబ్రవరి 15 నుంచి నిర్వహించనున్నారు.

వంద శాతం ఫలితాల సాధనకు తీసుకున్న చర్యలు..

- వందశాతం ఫలితాల సాధనకై ప్రతి రోజూ సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు.
- తరచు స్లిప్ టెస్టులు నిర్వహించి వాటిలో వచ్చిన మార్కుల ఆధారంగా వెనుకబడిన వారిని గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.
- విద్యార్థులకు అర్థం కాని అంశం ఉంటే తిరిగి వివరిస్తున్నారు.
- కళాశాలకు ముందస్తు సమాచారం లేకుండా గైర్హాజరు అయితే విద్యార్థి ఇంటికి ఫోన్ చేస్తున్నారు.
- ఇప్పటికే సిలబస్ పూర్తి చేసి రివిజన్ మొదలుపెట్టారు.
- ఫిబ్రవరి వరకు ఈ క్లాస్‌లను కొనసాగించాలని అధ్యాపక యంత్రాంగం నిర్ణయించింది.

మెరుగైన ఫలితాల సాధనే లక్ష్యం



2022-23 విద్యాసంవత్సరంలో మెరుగైన ఫలితాల సాధనే లక్ష్యంగా పనిచేస్తున్నాం. గత ఏడాది ఎలా ఉన్నా ఈసారి 100 శాతం రావాలని తపనతో ముందస్తు ప్రణాళికతో పనిచేస్తున్నాం. అధ్యాపకులంతా అంకితభావంతో పనిచేసే వారు కావడం, విద్యార్థులలో కష్టపడే తత్వం కనిపించడంతో ఆశించిన ఫలితాలు వస్తాయనే నమ్మకం ఉంది.

–శ్రీనివాసులు, ప్రిన్సిపల్, రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాల

మెగా రక్తదాన శిబిరం



రాయదుర్గం: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఐకేఎఫ్ హోమ్ ఫైనాన్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆర్యేంద్రకుమార్ పేర్కొన్నారు.ఐకేఎఫ్ గ్రూప్ ఆధ్వర్యంలో తలసేమియా సికిల్ సొసైటీ సహకారంతో రాయదుర్గం సర్వే నంబర్ 83లోని మైహోమ్ ట్విట్జా కార్యాలయంలో బుధవారం మెగా రక్తదాన శిబిరాన్ని ఐకేఎఫ్ ఫైనాన్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎన్ రామరాజుతో కలిసి ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మా సంస్థ ఉద్యోగులందరినీ ఇందులో భాగస్వాములను చేసి తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు ఉపయోగపడేలా చేయడమే లక్ష్యమన్నారు. పలువురు ఐకేఎఫ్ ఉద్యోగులు, సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో టీఎస్‌సీఎస్ జాయింట్ సెక్రటరీ అలీబ్‌బేగ్, ఐకేఎఫ్ గ్రూపు సంస్థల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ఆల్విన్‌కాలనీ, వివేకానందనగర్, కూకట్‌పల్లి డివిజన్‌ల పరిధిలోని పలువురికి బుధవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ షాదీముబారక్, కల్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ 31మంది లబ్ధిదారులకు సుమారు రూ.31 లక్షల రూపాయలు అందజేశామన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన తెలిపారు. వివేకానందనగర్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, నాయకులు నాయినేని చంద్రకాంత్‌రావు, కాశీనాద్ యాదవ్, మోజస్, బోయ కిషన్, రాము, శ్రావణిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా తమ పేరును నమోదు చేయించుకోవాలని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి సూచించారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా బుధవారం గచ్చిబౌలి డివిజన్‌లోని గోపన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మొగిలయ్య, ఉమాదేవి, సరిత, అంగన్‌వాడీ టీచర్ రాధిక, నాయకులు హన్మంతునాయక్, వెంకటేష్, రాఘవేంద్ర, వెంకటేష్ ,విద్యార్థులు పాల్గొన్నారు.



గోపన్‌పల్లిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

శేరిలింగంపల్లి సర్కిల్ ఆఫీస్‌లో..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ ఆఫీస్‌లో బుధవారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఉద్యోగులు, ఓటర్లతో జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ శంకరయ్య ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జాయింట్ జోనల్ కమిషనర్ మల్లారెడ్డి, ఎంఈఓ వెంకటయ్య, డిప్యూటీ తహశీల్దార్ మహిపాల్‌రెడ్డి, ఏఎంసీలు నరేందర్‌రెడ్డి, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని, 18 సంవత్సరాల వయస్సు ఉన్న వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.జాతీయ ఓటర్ల దినోత్సవంను పురస్కరించుకొని బుధవారం పటాన్‌చెరు పట్టణంలోని డీఎస్పీ కార్యాలయం ఎదుట నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామిక దేశం భారతదేశం అన్నారు. యువ ఓటర్లను ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రతి ఏటా జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సుష్మా శ్రీ వేణుగోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు సుప్రజా వెంకట్‌రెడ్డి, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, తహసీల్దార్ పరమేశం, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దశరథ రెడ్డి, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో జీ-20 పాత్ర కీలకం

రాయదుర్గం: ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో జీ–20 దేశాల భాగస్వామ్యం 80 శాతం ఉంటుందని, ఇది ఎంతో కీలకమని యూఎన్‌లో శాశ్వత ప్రతినిధి సయ్యద్ అక్బరుద్దీన్ వెల్లడించారు. జీ–20 అధ్యక్ష స్థానంలో ఉన్న మనకు మరింత బాధ్యత ఉందని గుర్తు చేశారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో బుధవారం సాయంత్రం జాకీర్ హుస్సేన్ లెక్చర్ హాల్ కాంప్లెక్స్‌లో 'జీ-20- యూనివర్శిటీ కనెక్ట్' ఈవెంట్‌లో భాగంగా ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం ద్వారా జీ–20 అధ్యక్ష పదవిని చేపట్టడం గొప్ప విషయమన్నారు. 2023లో మన దేశంలో మొదటిసారిగా జీ–20 లీడర్స్ సమ్మిట్‌ను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావు మాట్లాడుతూ ప్రపంచాన్ని భారతదేశానికి తీసుకురావడానికి జీ–20 ఒక మార్గమన్నారు. ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్, హెచ్‌సీయూ ప్రొవీసీ ప్రొఫెసర్ ఆర్ఎస్ సర్రాజు, మాజీ ప్రొవీసీ ప్రొఫెసర్ ఈ.హరిబాబు, రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్ నిగమ్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న సయ్యద్ అక్బరుద్దీన్

హోరాహోరీగా హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ మూడో సీజన్ హోరాహోరీగా సాగుతోంది. ఈ సీజన్ రెండో రౌండ్‌కు బౌల్డర్స్ హిల్స్ గోల్ఫ్ క్లబ్ ఆతిథ్యమిస్తోంది. మొత్తం 16 జట్లు ఈ సీజన్‌లో తలపడుతుండగా.. మూడో గోల్ఫ్ క్లబ్స్‌లో లీగ్ జరుగుతోంది. ఫైనల్స్‌ను థాయ్‌లాండ్‌లో నిర్వహించనున్నారు. 2020లో 12 జట్లతో మొదలైన హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్‌కు యువ గోల్ఫర్స్ దేశవ్యాప్తంగా మంచి స్పందన కనిపిస్తోందని లీగ్ కమీషనర్ డి.ఎస్.సుమంత్ చెప్పారు. కాగా, రెండో రౌండ్ పోటీల్లో మహిళా గోల్ఫర్ కవిత మంత ప్లేయర్ ఆఫ్ దే డేగా నిలిచింది. ఇప్పటివరకూ గ్రూప్ ఏలో మీనాక్షి మావెరిక్స్, సామా ఏంజేల్స్, గ్రూప్ బిలో అగిల్స్ దర్టీ డజెన్, అక్షర యోధాస్, గ్రూప్ సీలో ఈహెచ్ ఏఎం, టీమ్ ఆల్ఫా, గ్రూప్ డీలో మైసా, ఆరిజిన్స్ ఆధిక్యంలో ఉన్నాయి.



ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే లక్ష్యం



మియాపూర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను కలిసిన గుర్రం చెన్నకేశవరెడ్డి

పీఆర్‌టీయూ టీఎస్ ఎంఎల్‌సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి

శేరిలింగంపల్లి: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ప్రథమ కర్తవ్యమని పీఆర్‌టీయూ టీఎస్ ఎంఎల్‌సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. శేరిలింగంపల్లిలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల బాలుర, బాలికల కళాశాల, జెడ్పీహెచ్ఎస్ ఖాజాగూడ, నవోదయ విద్యాలయ, గచ్చిబౌలి, లింగంపల్లి, మియాపూర్ ఉన్నత పాఠశాలల్లో ఆయన ఉపాధ్యాయులను కలిసి తన అభ్యర్థిత్వాన్ని బలపర్చాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు అనేక జీఓలను సాధించి పెట్టింది పీఆర్‌టీయూ సంఘమేనన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పీఆర్‌టీయూ ఎప్పుడూ ముందుంటుందన్నారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవర్ధన్‌యాదవ్, మహేందర్‌రెడ్డి, ప్రతినిధులు కృష్ణారెడ్డి, నారాయణగౌడ్, హన్మంతు, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్ రెడ్డి ,గురుకుల కళాశాల, నవోదయ విద్యాలయాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చందానగర్‌లో చైన్ స్నాచింగ్

మియాపూర్: చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చైన్ స్నాచర్లు రెచ్చిపోయారు. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు... శేరిలింగంపల్లిలోని హుడా ట్రేడ్ సెంటర్ సమీపంలో ఉంటున్న రాజశ్రీ బుధవారం మధ్యాహ్నం పిల్లలకు లంచ్ బాక్స్ ఇవ్వడానికి స్కూల్‌కు వెళ్లింది. అక్కడ నుండి లింగంపల్లి మార్కెట్ వైపు వెళ్తుండగా ద్విచక్ర వాహనం పై గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు వచ్చి రాజశ్రీ మెడలో నుంచి మంగళసూత్రాన్ని లాక్కొని వెళ్లాడు. దీంతో ఆమె చందానగర్ పోలీసులకు సమాచారం ఇవ్వగా, సంఘటన స్థలానికి చేరుకొని సీసీ కెమెరాలను పరిశీలించారు. పోలీసులు బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టామని తెలిపారు.

మరో చోట..

చందానగర్‌లోని రెడ్డి కాలనీలో నివాసముంటున్న లక్ష్మి అపర్ణ అపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేస్తోంది. ప్రతిరోజు ఉదయం 7 గంటలకు వెళ్లి మధ్యాహ్నం 2 గంటలకు తిరిగి ఇంటికి వెళ్తోంది. ఈ క్రమంలో ఉద్యోగం ముగించుకొని వెళ్తుండగా మార్గమధ్యలో సురక్ష ఎన్‌క్లేవ్‌కు వెళ్తుండగా వెనక వైపు నుంచి ఇద్దరు వ్యక్తులు బైక్ పై వచ్చి మెడలో ఉన్న రెండు తులాల బంగారు ఆభరణాలను లాక్కొని పారిపోయారు. బాధితురాలు లక్ష్మీ చందానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

రైల్ ఢీ గుర్తు తెలియని వ్యక్తి మృతి

మియాపూర్: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చందానగర్ రైల్వే స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన ప్రకారం ...చందానగర్ రైల్వే స్టేషన్ సమీపంలో అండర్ పాస్ బ్రిడ్జి పక్కన ఓ వ్యక్తి పట్టాలు దాటుతుండగా లింగంపల్లి నుంచి హఫీజ్‌పేట్ వైపు వెళ్తున్న రైలు ఢీకొట్టింది. దీంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. అతని వద్ద ఎలాంటి సమాచారం లేదు. అతని వయస్సు సుమారు (35–38) వరకు ఉంటుందని తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సేవా పతకాలు అందజేత

రాయదుర్గం: విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం సైబరాబాద్ కమిషనరేట్ ప్రాంగణంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 154 మంది సైబరాబాద్ పోలీసు అధికారులకు సేవా పతకాలను అందించారు.అనంతరం వారిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో సైబరాబాద్ జాయింట్ సీపీ అవినాష్‌మహంతి, ట్రాఫిక్ జాయింట్ సీపీ నారాయణ్‌నాయక్, ట్రాఫిక్ డీసీపీ టి శ్రీనివాసరావు, సీఏఆర్ ఏడీసీపీ రియాజ్, ఏసీపీలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



సైబరాబాద్ కమిషనరేట్‌లో పతకం అందజేస్తున్న సీపీ స్టీఫెన్ రవీంద్ర

అక్రమ కట్టడాలను ఉపేక్షించం

మాదాపూర్: అక్రమంగా, అనుమతులు లేకుండా భవనాలు, షెడ్‌లను నిర్మిస్తే ఉపేక్షించేది లేదని చందానగర్ టీపీఎస్ మధు తెలిపారు. మాదాపూర్‌లో బుధవారం సిబ్బందితో కలసి అక్రమంగా నిర్మిస్తున్న భవన నిర్మాణాల సెల్లార్ గుంతలలో వేసిన పిల్లర్లతో పాటు రెండు భవనాల స్లాబ్‌లను కూల్చివేశారు. అక్రమ నిర్మాణాలను పూర్తిగా తొలగిస్తామని అధికారులు తెలిపారు. జీహెచ్ఎంసీ కార్యాలయంలో సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. వెంటనే అక్రమ నిర్మాణాలను పూర్తి స్థాయిలో కూల్చివేసి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



మాదాపూర్‌లో భవనాల స్లాబ్‌లను కూల్చివేసిన జీహెచ్ఎంసీ సిబ్బంది

పట్టణంలో కోనసీమ (పల్లె) జాతర

- నల్లగండ్ల అపర్ణ సరోవర్‌లో ఈ నెల 27,28,29 తేదీల్లో..
- ప్రభల తీర్థం వేడుకలు



అపర్ణ సరోవర్‌లో ప్రభల ఊరేగింపు (ఫైల్)

శేరిలింగంపల్లి: నగరంలో కోనసీమ జాతర నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. 400 ఏళ్ల చరిత్ర ఉన్న కోనసీమ ప్రబల తీర్థం వేడుకలకు ఈ నెల 27,28,29 తేదీల్లో శేరిలింగంపల్లి నల్లగండ్లలోని అపర్ణ సరోవర్ ముస్తాబవుతోంది. వివరాల్లోకి వెళితే... తూర్పు గోదావరి జిల్లా జగ్గన్నతోట వద్ద జరిపే ఈ వేడుకల్లో ఏకాదశ ప్రభలు 11 గ్రామాల నుంచి తరలి వస్తాయి. జగ్గన్నతోట వద్ద కలిసి తీర్థం జరిపిన తరువాత ఆయా గ్రామాలకు తిరిగి వెళ్తాయి. ఏకాదశ రుద్రులను ఒకేచోట చేర్చి పూజిస్తారు. గ్రామీణ ప్రాంతంలో నిర్వహించే జాతర వలే ప్రభల తీర్థంలో కూడ రంగుల రాట్నాలు, చిలక జోస్యం, కుమ్మరుల కుండల తయారీ విధానం, వీధి గారడీ, బుజ్జి బూరెలు, పీచు మిఠాయిలతో పాటు చేనేత, హస్తకళల స్టాల్స్ వంటివి ఏర్పాటు చేస్తారు.అదే విధంగా రథం ముగ్గులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

ఈశ్వరుని రూపంగా ప్రభ

కోనసీమలో ఈశ్వరుని రూపంగా ప్రభలను కొలుస్తారు. వెదురు కర్రలు, రంగు,రంగుల నూతన వస్త్రాలు, కాగితాలతో ప్రభలను తయారు చేస్తారు. అనంతరం వివిధ రకాల పూలతో అలకరించి శివ పార్వతుల చిత్రపటాలను ప్రభల్లో ఏర్పాటు చేసి మేళతాళాలు, కోలాటాలతో ఊరేగింపు నిర్వహిస్తారు. మహిళల కోలాటాలు, హరహర మహాదేవ నినాదాలతో ఆ ప్రాంతం మారుమోగుతుంది.

సందడిగా తీర్థం వేడుకలు...

నల్లగండ్ల అపర్ణ సరోవర్‌లో ప్రభల తీర్థం వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు చందన వెల్లడించారు. ఈ వేడుకలను సరోవర్‌లో 2016 నుంచి నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ వేడుకల్లో సరోవర్‌లో ఉన్న అన్ని ప్రాంతాల వారు ఉత్సాహంగా పాల్గొంటారని, 27వ తేదీన వేడుకలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఆ రోజు మహిళలు, చిన్నారులు పల్లె ఆటలతో ప్రారంభం అవుతాయన్నారు. 28న పురుషులకు పల్లె ఆటలు, ప్రభలు కట్టడం, రథం ముగ్గులు, రంగుల రాట్నాలు, మహా శివలింగం గుడిని సిద్ధం చేయడం, ఫ్రీ స్టైల్ ఎగ్జిబిషన్ తదితర కార్యక్రమాలు ఉంటాయి. 29న వేడుకల్లో భాగంగా ప్రభలను అపర్ణ సరోవర్‌లో ఊరేగిస్తారు. ప్రభలను మహిళలు, చిన్నారులు కూడా మోయడానికి ఆసక్తి కనబరుస్తుండడం విశేషం.



దేవతామూర్తుల వేషధారణలో చిన్నారులు